సాక్షి
మంచిర్యాల
శనివారం, 7, సెప్టెంబర్, 2024


విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రతిమలు

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేను కలిసిన మంత్రి సీతక్క


మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షురాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ దంపతులను శుక్రవారం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క కలిశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన ఆమెకు వారు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మట్టి వినాయకున్ని పూజిద్దాం


మట్టి విగ్రహాలు అందజేస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ప్రజలు మట్టి వినాయకులను పూజించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన బంకమట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మట్టి వి నాయకులను పూజించడంతో చెరువులు, జలా శయాలు కలుషితం కాకుండా ఉంటాయని, బంకమట్టి వినాయకులను పూజించడం మన సంస్కృతి అని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో రూపొందించిన వినాయక విగ్రహాలకు వివిధ రసాయనాల కలయికతో నిమజ్జనం చేసినప్పుడు నీరు, నేల కలుషితం అవుతాయని తెలిపారు. అనంతరం చెరువు మట్టి–గణపతి మట్టి సంబంధిత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండల అధికారి నాగేశ్వరావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అధికారులు సంఘం అధ్యక్షుడు దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలు నేత్రదానానికి ముందుకు రావాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న యశ్వంత్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రజలందరూ నేత్రదానానికి ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ యశ్వంత్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో లయన్స్‌క్లబ్ మంచిర్యాల సభ్యులు 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, ఆర్‌ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీధర్, సీని యర్ ఆప్తామాలజి టెక్నీషియన్ శంకర్, ప్రొఫెసర్ డాక్టర్ చంద్రభాను, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిల్ప, ప్రోగ్రాం చైర్మన్ వి.మధుసూద న్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాల్‌మోహన్, సభ్యులు వినయ్‌కుమార్, పి.రాజేశ్వర్‌రావు, కొత్త సురేందర్, ఎస్.నాగేందర్, గేడ బాబు పాల్గొన్నారు.

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతం


కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో శుక్రవారం టీజీ ఐసెట్–2024 కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌కు మొదటి రోజు 275 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులను వరుస క్రమంలో కౌన్సెలింగ్ కేంద్రంలోకి ఆహ్వానించి అధికారులు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా హెల్ప్‌లైన్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మారం దేవేందర్, సిస్టం ఎనలిస్ట్ తుమ్మ మధుకర్ చీఫ్ వెరిఫికేషన్ అధికారి డి.రామ్‌దాస్, వెరిఫికేషన్ అధికారులు రాజమల్లు, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

జై జై గణేశా..!


మండపంలో భారీ గణపయ్య


విభిన్న రూపాల్లో వినాయకుడు


ముస్తాబవుతున్న బొజ్జ వినాయక మండపం

- నేడు వినాయక చవితి
- కొలువుదీరనున్న ప్రతిమలు
- నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- మట్టి ప్రతిమలకు డిమాండ్

మంచిర్యాలఅర్బన్: పూజల్లో ప్రథమ పూజ అందుకునే ఆదినాయకుడు గణనాథుడు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పూజలందుకునేందుకు ముస్తాబయ్యాడు. శనివారం వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాల్లో విఘ్నరాజు కొలువు దీరనున్నాడు. పిల్లలు, యువకులు, పెద్దలు, మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. విభిన్న ఆకృతులు, అలంకారం, అవతారంలో కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న గణపతులను శుక్రవారం నుంచే మండపాలకు తరలిస్తున్నారు.

మట్టి ప్రతిమలపై ఆసక్తి

పర్యావరణ హిత ప్రతిమల ఏర్పాటుపై ప్రజల్లో ఆలోచన పెరుగుతూ వస్తోంది. దీంతో మట్టి ప్రతిమలకు డిమాండ్ నెలకొంది. కరీంనగర్, కాగజ్‌నగర్‌లో రూపుదిద్దుకున్న మట్టి వినాయకులను మంచిర్యాలలో విక్రయించారు. ఒక్కొక్కటి రూ.100 నుంచి ఆపైన ధరలు పలికాయి. ఇళ్లలో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసుకునే ప్రజలు మట్టి విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపించారు. మట్టి విగ్రహాలు ఏర్పాటు చేస్తే ఒక తొట్టిలో నీరు పోసి నిమజ్జనం చేసుకోవచ్చు. ఆ మట్టిని చెట్లకు పోయడంతో ప్రకృతిని మనం కాపాడుకోవచ్చని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

విభిన్న రూపాలు

వినాయకుడి ప్రతిమలను విభిన్న రూపాల్లో పూజలకు సిద్ధం చేశారు. నిజామాబాద్, మహారాష్ట్ర నుంచి వచ్చిన కార్మిక కుటుంబాలతో విగ్రహాలు తయారు చేయించారు. మూషిక గణనాథుడు, సిద్ధివినాయకుడు, బాహుబలి గణేష్, డమరుక వినాయకుడు తదితర రూపాల్లో విగ్రహాలు లభిస్తున్నాయి. రెండు అడుగుల నుంచి 12అడుగుల విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. భారీ విగ్రహాలను మంచిర్యాల నుంచి నస్పూర్, మందమర్రి, జైపూర్, చెన్నూర్, హాజీపూర్, లక్సెట్టిపేట తదితర ప్రాంతాలకు వాహనాల్లో తరలించారు. దీంతో పట్టణంలోని విక్రయ కేంద్రాల వద్ద సందడి ఏర్పడింది. హైదరాబాద్ వంటి నగరాల నుంచి పది రోజుల క్రితమే ప్రత్యేక వాహనాలపై భారీ విగ్రహాలను మంచిర్యాలకు తరలించారు.

పండుగ సందడి

జిల్లాలో శుక్రవారం నుంచే పండుగ సందడి నెలకొంది. మంచిర్యాలలో గణేషుని కొలిచేందుకు అవసరమైన పూజాసామగ్రిని భక్తులు కొనుగోలు చేశారు. వినాయక పత్రి, పండ్లు, పూజాసామగ్రి, ఎలక్కాయలు, తామరపువ్వులు, మామిడి ఆకులు, ఉసిరి, సీతాఫలాలు విక్రయానికి దారి పొడవునా తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశారు. 10 నుంచి 20రకాల పూజా సామగ్రిని రూ.100 నుంచి రూ.120వరకు విక్రయించారు.

ఉచిత పంపిణీకి ఏర్పాట్లు..

మంచిర్యాలలో స్వచ్ఛంద సంస్థలు శనివారం మట్టి వినాయకుల పంపిణీకి ఏర్పాట్లు చేశాయి. వాసవి మెడికల్ ఆధ్వర్యంలో వద్ద ఉచిత మట్టి వినాయకులు పంపిణీ చేయనున్నారు.

అందుబాటులో ధరలు..

వినాయకుల ధరలు అందుబాటులో ఉన్నాయి. ఇదివరకు విగ్రహాలను తెప్పించి ఇచ్చేవాళ్లం. రవాణా చార్జీల వల్ల ఎక్కువ ధరలు ఉండేవి. నాగ్‌పూర్, మహారాష్ట్ర, కోరుట్ల తయారీదారులను రప్పించి, ముడి సరుకులు ఇక్కడే తయారు చేయిస్తున్నాం. ఫీటు నుంచి మొదలుకుని 13 ఫీట్లకు వరకు విగ్రహాలు ఉన్నాయి. రూ.1000 నుంచి రూ.25వేల వరకు ధరలు పలుకుతున్నాయి.
– గుండా శ్రీనివాస్, వ్యాపారి


పూజా సామగ్రి విక్రయాలు


మంచిర్యాలలో మట్టి వినాయకుల విక్రయం


మంచిర్యాలలో గణనాథుల ప్రతిమలు


వాహనంలో విగ్రహం తరలిస్తున్న ప్రజలు

కరెంటుపై ఏమరుపాటు వద్దు

- విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ పక్కన మండపాలు వద్దు
- ఉత్సవ నిర్వాహకులు విద్యుత్ శాఖ అనుమతి పొందాలి
- జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎన్.శ్రావణ్‌కుమార్


మంచిర్యాలలో వినాయక మండపం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వినాయక నవరా త్రి ఉత్సవాలకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. వందల సంఖ్యలో మండపాలు ఏర్పాటు చేశారు. నవరాత్రి ఉత్సవాల కోసం విద్యుత్ దీపాల అలంకరణ, సౌండ్‌సిస్టం, మైక్‌లు అమరుస్తున్నారు. గతంలో జి ల్లాలో విద్యుత్ దీపాల అలంకరణ, విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడ్డ సంఘటనలు ఉన్నాయి. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు తప్పనిసరిగా విద్యుత్ శాఖ అనుమతి పొందాలని, ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎన్.శ్రావణ్‌కుమార్ సూచించారు. తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ పక్కన మండపాలు ఏర్పాటు చేయొద్దని, ఇళ్లు, దుకాణాల నుంచి విద్యుత్ వినియోగించొద్దని, కొండీలు వేయొద్దని పేర్కొన్నారు. మండపాలకు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకుని ఆ ప్రాంత ఏఈని సంప్రదించాలని తెలిపారు. విద్యుత్ శాఖ అనుమతి ఉంటేనే డీజే, టెంట్‌హౌజ్, విద్యుత్ పరికరాలు అద్దెకు ఇవ్వాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భద్రతకు సైన్యం సిద్ధం

- జిల్లాలో నిఘా, పెట్రోలింగ్ వ్యవస్థ మరింత పటిష్టం
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

మంచిర్యాలక్రైం: జిల్లాలో నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసు సైన్యం సిద్ధమైంది. గత ఏడాది జిల్లాలో 1970 ప్రతిమలు ఏర్పాటు చేయగా.. ఈ ఏడాది ఆ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. శుక్రవారం రాత్రి వరకు జిల్లాలో సుమారు 1500 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. శనివారం నుంచి తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతాయి. అదే సమయంలో మిలాద్ ఉన్ నబీ కూడా ఉండడంతో ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకునే విధంగా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. ఇప్పటికే రెండుసార్లు రామగుండం సీపీ శ్రీనివాసులు శాంతి కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలీ సు యంత్రాంగం ప్రత్యేక నిఘా, రాత్రి, పగలు పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయక మండపాల వద్ద 24గంటలూ పర్యవేక్షణకు పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ మండపం వద్ద రెండు సీసీ కెమెరాలు, ముగ్గురు వ్యక్తులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ వినాయక విగ్రహాన్ని జియో ట్యాగింగ్ చేయనున్నారు.

చిట్టి చేతులు.. మట్టి గణపతులు




మట్టి వినాయకుల తయారీలో విద్యార్థులు


మాట్లాడుతున్న శివ్ ఆశిష్‌సింగ్

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా కాలుష్య నివారణకు చిట్టి చేతులతో మట్టి గణపతులు తయారు చేశారు. శుక్రవారం మంచిర్యాలలోని సైన్స్ కేంద్రంలో అటవీ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. వినాయక ప్రతిమలకు అవసరమైన మట్టిని అటవీ శాఖ సమకూర్చింది. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు వంద మందికిపై పైగా నాలుగు గంటలపాటు ప్రతిమల తయారీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగుల వినాయకులకు తీసిపోకుండా వివిధ రూపాల్లో భక్తులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. ఈ విగ్రహాలను విద్యార్థులు ఇళ్లలో పూజించనున్నారు. మిగిలిన వాటిని విద్య, అటవీ శాఖ ఉద్యోగులకు పంపిణీ చేశారు. ప్రతియేటా తాను పనిచేస్తున్న గ్రామంలో ఇంటింటికి మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న అకెనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాధు లింగయ్య, ఐదు వేల వినాయకులు పంపిణీ చేస్తున్న కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ పద్మచరణ్, కుమ్మరి సంఘం బాధ్యులు కుమ్మరి రమేష్, కుమ్మరివృత్తినే నమ్ముకుని జీవిస్తున్న మల్లేష్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అధికారి మధుబాబు ఫారెస్ట్ రెంజ్ అధికారి రత్నాకర్‌రావు, సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, డీసీఈబీ సెక్రెటరీ భీంరావు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో..

మంచిర్యాల భవిత కేంద్రంలో విద్యార్థులకు పర్యావరణ స్పృహ కలిగేలా ఐఈఆర్పీలు సృజన, శ్రీలత మట్టిమేలు తలపెట్టారు. ఆలోచనలకు పదును పెడుతూ సైన్స్‌సెంటర్ వద్ద నుంచి మట్టి తీసుకువచ్చి ప్రత్యేక అవసరాల పిల్లలతో వినాయకులు తయారు చేయించారు. ప్రతిమల తయారీలో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

మట్టి వినాయక విగ్రహాల వినియోగంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. మట్టి విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసినా నీరు కాలుష్యానికి గురికాదు. చేపలు, ఇతర జీవులకు ఎలాంటి హానీ కలుగదు. విపరీత వర్షపాతాలు, వాతవారణ పరిస్థితుల్లో మార్పులకు ప్లాస్టిక్ వినియోగమే కారణం. ప్రతి ఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగం తగ్గించి పర్యావరణహితంలో భాగస్వాములు కావాలి.
– శివ్‌ఆశిష్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

మట్టి ప్రతిమలను పూజించాలి

ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలి. ప్రకృతిని అమ్మలా కాపాడుకోవాల్సిన అవసరముంది. మట్టి ప్రతిమల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించటంతోపాటు సందేశాన్ని ఇచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం.
– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

ప్రజాధనాన్ని లూటీ చేసిన బీఆర్‌ఎస్

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- వాటర్‌ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ


చెన్నూర్‌లో భూమి పూజ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చెన్నూర్: అభివృద్ధి పేరిట బీఆర్‌ఎస్ ప్రజాధానాన్ని లూటీ చేసిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విమర్శించారు. శుక్రవారం స్థానిక గెర్రెకాలనీలో రూ.31కోట్లతో అమృత్ 2.0 పథకం ద్వారా మంజూరైన వాటర్‌ట్యాంకు నిర్మాణానికి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఏ గ్రామానికి వెళ్లినా తాగునీటి సమస్యపై ప్రజలు చెప్పారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాగునీటి ట్యాంకు పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. రెండు వేల నల్లా కనెక్షన్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని అన్నారు. ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ కమీషన్ల కోసమే మిషన్ భగీరథ స్కీం పేరుతో బీఆర్‌ఎస్ రూ.40వేల కోట్లు ఖర్చు చేసిందని, ఆ పథకం ఫెయిల్యూర్ అని ఎన్నోసార్లు చెప్పానని అన్నారు. ఎంపీ కృషి మూలంగానే చెన్నూర్, క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీలకు అమృత్ 2.0 పథకం మంజూరైందని తెలిపారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని మున్సిపాలిటీ రిసోర్స్‌పర్సన్లు ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అర్చనగిల్డా, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కౌన్సిలర్ సయ్యద్ నసీమా సుల్తాన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఫయాజ్, నాయకులు గొడిసెల బాపురెడ్డి పాల్గొన్నారు.

ఎండాకాలంలోగా ఇంటింటికీ తాగునీరు

రామకృష్ణాపూర్: వచ్చే ఎండాకాలంలోగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. అమృత్ పథకంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని అమ్మాగార్డెన్ ఏరియాలో రూ.41 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకు పనులకు శుక్రవారం ఎంపీ గడ్డం వంశీ, కలెక్టర్ కుమార్ దీపక్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో 5200 ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా చేస్తామని చెప్పారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ మాట్లాడుతూ క్యాతనపల్లి ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మరో నాలుగు నెలల్లో పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక సమస్యలను పలువురు ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కమిషనర్ మురళీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

- సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి


మాట్లాడుతున్న జడ్జి అర్పిత

లక్సెట్టిపేట: విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్సీ బాలికల వసతిగృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, చదువుతోపాటు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. ఉన్నత చదువులు చదివి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని కోరారు. ఉద్యోగం సంపాదించిన తర్వాత వివాహం చేసుకోవాలని, ప్రణాళికతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులున్నా తెలియజేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏజీపీ వేల్పుల సత్యం, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యూవో సునిత పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలి



అవగాహన కార్యక్రమంలో డాక్టర్ హరీష్‌రాజ్

మంచిర్యాలటౌన్: అన్ని రకాల ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలని, జనాభాను వివిధ భాగాలుగా విభజించి ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.హరీష్‌రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని, మందులు, వ్యాక్సిన్ వివరాల లభ్యతను పరిశీలించి, ఆరోగ్య కేంద్రం పరిధిలోని డెంగీ వ్యాధులకు సరైన చికిత్స అందించాలని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తీర్చిదిద్దేందుకు 15 రోజుల సమయం ఇస్తున్నానని, నిబంధనల మేరకు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీవో అపర్ణ, ప్రోగ్రాం మేనేజర్ మహేందర్, డీపీవో ప్రశాంతి, వైద్యాధికారి డాక్టర్ అశోక్, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.

30 వరకు ఎయిడ్స్‌పై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లాలో దిశ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 30వరకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ చేపడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.హరీష్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీతారామరాజు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్, మెడికల్ ఆఫీసర్ నరేందర్‌రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ నీలిమ, డీపీఎం ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎల్లంపల్లి’కి తగ్గిన వరద


ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి తగ్గింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు మూసివేయగా, కడెం ప్రాజెక్ట్ నుంచి నాలుగు వేల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 12 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 19.210 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో 16 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా.. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 302 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. నిన్నటి వరకు 32 గేట్లను ఎత్తిన అధికారులు ప్రాజెక్టుకు ఎలాంటి వరద ఉధృతి లేకపోవడంతో మూసివేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుర్మపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమగూడెం గ్రామానికి చెందిన నందూలాల్(40) మృతిచెందాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారికి సంబంధించి పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న నందూలాల్ మరో ఇద్దరు సిబ్బంది బాలుస్వామి, రంజిత్‌లతో కలిసి తెల్లవారుజామున పెట్రోలింగ్ వాహనంలో విధుల్లో ఉన్నాడు. మంచిర్యాల వైపు వెళ్తున్న ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో నందూలాల్‌కు తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. గాయపడిన బాలుస్వామి, రంజిత్‌లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక


ఎంపికైన మహిళా క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా తైక్వాండో కోచ్‌లు మోకనపల్లి నరేశ్, మోకనపల్లి శశిధర్ తెలిపారు. ఈ నెల 5న హైదరాబాద్‌లో నిర్వహించిన రెండవ ఖేలో ఇండియా ఉమెన్స్ తైక్వాండో లీగ్–2024లో మోకనపల్లి నాగలక్ష్మి, ఎండీ.అఫ్రీన్ కాతున్, జి.మణిప్రియ, బి.నిఖిత ప్రతిభ కనబర్చగా ఎంపిక చేశారని తెలిపారు. ఈ నెల 11 నుంచి 14వరకు తమిళనాడులోని దిండిగల్‌లో జరిగే నేషనల్ ఖేలో ఇండియా తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన వారిని తైక్వాండో తెలంగాణ సెక్రెటరీ ఏ.ప్రవీణ్ కుమార్, జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ కె.రాజ్‌వీర్ అభినందించారు.

మట్టి వినాయక @ 66


చెన్నూర్‌లో మట్టి విగ్రహం తయారు చేస్తున్న దృశ్యం

- ఆరున్నర దశాబ్దాలుగా ఏర్పాటు
- నానయ్య పంతులు దూరదృష్టి
- ఉత్సవాలు ముగిసే వరకు భజన
- నిమజ్జనంలో డీజేలు, డప్పు చప్పుళ్లు ఉండవు..


విశ్వ బ్రాహ్మణ గణేశ్ మండపం కోసం సిద్ధమవుతున్న మట్టి విగ్రహం

చెన్నూర్: ఆరున్నర దశాబ్దాల క్రితం మట్టి వినాయక ప్రతిమ ఏర్పాటుకు బీజం పడింది. ఆ ఆచారం అనాదిగా కొనసాగుతూ వస్తోంది. దూరదృష్టితో ఆలోచించి నానయ్య పంతులు వేసిన మట్టి గణపతి తయారీ పునాది నేటికీ కొనసాగుతోంది. చెన్నూర్ పట్టణంలోని విశ్వబ్రాహ్మణులు గత అరవై ఆరేళ్లుగా మట్టి గణపతిని స్వయంగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 1958 సంవత్సరంలో అకినపల్లి నానయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సమయంలో ఆయన మిత్ర బృందం లక్ష్మయ్య, మల్లయ్యలతో కలిసి మట్టి గణపతిని తయారు చేశారు. విశ్వకర్మ కాలనీలో విశ్వకర్మ గణేశ్ మండలి పేరుతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు వరకు ప్రతీరోజు రాత్రి భజన కార్యక్రమం నిర్వహిస్తారు. నిమజ్జన సందర్భంగా నలుగురు వ్యక్తులు విగ్రహాన్ని మోసుకుంటూ వెళ్లి పెద్ద చెరువులో నిమజ్జనం చేసే వారని శంకరయ్య తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు విశ్వ బ్రాహ్మణ గణేశ్ మండలి వద్ద భజన మండలి ఆధ్వర్యంలో ప్రతీరోజు భజన చేస్తారు. నిమజ్జనం రోజు డీజేలు, డప్పుచప్పుళ్లు లేకుండా భజన చేస్తూ ఊరేగింపుగా వెళ్లారు.

నాడు పక్షం రోజులు.. నేడు వారం రోజులు

నాడు విగ్రహం తయారు చేసేందుకు పక్షం రోజుల పాటు కష్టపడేవారు. స్వయంగా పొలాల మట్టిని తీసుకొచ్చి నియమ నిష్ఠాలతో పక్షం రోజులు మద్య, మాంసాహారాలు ముట్టకుండా తయారు చేసేవాళ్లు. ప్రస్తుతం నేటి యువకులు వినయ్‌చారి ఆధ్వర్యంలో వారం రోజుల్లో విగ్రహాన్ని తయారు చేస్తున్నారు.

పెద్దల ఆలోచన అమోఘం..



66 ఏళ్ల క్రితం మా తండ్రి నానయ్య ఉపాధ్యాయుడిగా ఉంటూ ఆనాడు చేసిన ఆలోచనను మా తరంతోపాటు నేటి యువత సైతం పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకొని మట్టి విగ్రహాన్ని తయారు చేయడం సంతోషంగా ఉంది. నేడు పర్యావరణ శాస్త్రవేత్తలు సైతం మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పుతున్నా.. కొందరు పెడచెవిన పెడుతున్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అందరూ మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయాలి.
– అకినపల్లి సత్యనారాయణ, చెన్నూర్

పుట్టమన్ను తెచ్చి... ప్రతిమలుగా మలిచి...


పంపిణీకి సిద్ధంగా ఉంచిన వినాయక ప్రతిమలతో నర్సయ్య దంపతులు

నిర్మల్‌ఖిల్లా: అతనో పర్యావరణ ప్రేమికుడు.. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మిశ్రమంతో తయారు చేసిన గణేశ్ విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని భావించి తన వంతు బాధ్యతగా అటవీ ప్రాంతం నుంచి తెచ్చిన పుట్టమన్ను, గోమయం (ఆవు పేడ) కలిపి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నాడు. వీటిని స్థానికులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. స్థానిక బంగల్‌పేట్ ప్రాంతానికి చెందిన 'పాపెన నర్సయ్య' ప్రకృతి ప్రసాదించిన పుట్టమన్ను, ఆవు పేడతో తయారుచేసిన ప్రతిమలను పూజించడం వల్లనే పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామని పేర్కొంటున్నాడు. పదేళ్లుగా హైదరాబాదులోనూ పంపిణీ చేసినట్లు చెబుతున్నాడు. మట్టి గణపతినే ప్రతిఒక్కరూ ప్రతిష్ఠించి, పూజించాలని కోరుతున్నాడు. వినాయక చవితి పర్వదినం నేపథ్యంలో ఉచితంగా గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తూ, పర్యావరణ స్ఫూర్తిని చాటుతున్న పాపెన నర్సయ్య–విజయలక్ష్మి దంపతులను పలువురు అభినందిస్తున్నారు.


విగ్రహాలను తీర్చిదిద్దుతున్న నర్సయ్య

హెల్ప్ డెస్క్ ప్రారంభం


హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న గని మేనేజర్

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 3 గనిలో ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను గని మేనేజర్ వెంకట్‌రావు ప్రారంభించారు. గనిపై శుక్రవారం వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన, మరణించిన, అన్‌ఫిట్ ఉద్యోగుల సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యూటీ, వితంతు పెన్షన్, గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం, కారుణ్య నియామకాలు తదితర అన్ని వివరాలు ఒకే చోట పొందుపర్చామని, ఆ వివరాలన్నీ ఈ ప్రత్యేక హెల్ప్ డెస్క్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఈ సమాచారం టెర్మినల్ బెనిఫిట్స్ సెటిల్‌మెంట్ సమయంలో చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గని సంక్షేమాధికారి గౌస్‌పాషా, ఫిట్ కార్యదర్శి మురళీచౌదరి, అధికారులు ప్రేంకుమార్, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చలో జంతర్ మంతర్ విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించే చలో జంతర్ మంతర్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని, కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, నేతకాని మహర్ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు జాడి రాజేశ్, వీబీఏ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంబరి ప్రశాంత్, పోతరాజుల అశ్విన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సాంబార్ ఎంకవ్వ(94) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కుంటాల ఎస్సై భాస్కరాచారి కథనం ప్రకారం.. ఎంకవ్వ గురువారం రాత్రి కల్లూరులో 61 జాతీయ రహదారి దాటి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లింది. కల్లూరులో కిరాణా దుకాణంలో సరుకులు దింపేందుకు బొలెరో వాహనం భైంసా నుంచి వచ్చింది. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం, రాంగ్‌రూట్‌లో వచ్చిన డ్రైవర్ గమనించక వృద్ధురాలిని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఎంకవ్వను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలి మనుమడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

- ఆరుగురు మహిళలు, ఏడుగురు విటుల అరెస్ట్
- గత జూలైలో అదే లాడ్జి యజమాని అరెస్ట్

మంచిర్యాలక్రైం: జూలై 25న స్థానిక ఐబీ చౌరస్తాలోని సాయినాథ్ రెసిడెన్సి అండ్ లాడ్జిలో లాడ్జి యజమానితోపాటు ఇద్దరు యువకులు, ముగ్గురు మహిళలు వ్యభిచారం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ ఘటన ప్రజలు మరువక ముందే తాజాగా శుక్రవారం అదే లాడ్జిలో వ్యభిచారానికి పాల్పడుతున్న ఆరుగురు మహిళలు, లాడ్జి నిర్వాహకుడితో పాటు ఏడుగురు విటులను మంచిర్యాల పోలీసులు అరెస్టు చేశారు. లాడ్జి యజమాని జిల్లాలో రాజకీయంగా పేరున్న వ్యక్తి కావడం, రెండు సార్లు అదే లాడ్జిలో దందా సాగిస్తూ పట్టుబడడం చర్చనీయాంశమైంది. గత నెల 21న జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ గెస్ట్ హౌస్‌లో ఏడుగురు విటులు, ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సాయినాథ్ రెసిడెన్సి అండ్ లాడ్జిలో వ్యభిచారం జరుగుతోందని అందిన సమాచారం మేరకు సీఐ బన్సిలాల్ సిబ్బందితో ఆకస్మికంగా మెరుపు దాడి చేశారు. ఆరుగురు మహిళలు, ఆరుగురు పురుషులు వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారని సీఐ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బెల్లంపల్లి మండలం ఆకెనపెల్లికి చెందిన సుంకరి శివయ్య, గోదావరిఖనికి చెందిన మందాల శివ అశీష్, ఆకుల ప్రశాంత్, రౌతు కార్తీక్, లక్సెట్టిపేటకు చెందిన తిరుపతి, పెద్దపల్లి జిల్లా వెల్గటూర్‌కు చెందిన గోస్కుల ప్రశాంత్‌తోపాటు లాడ్జి నిర్వాహకుడు మోతం జనార్దన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మహిళలను సఖీ సెంటర్‌కు తరలించామని పేర్కొన్నారు. విటులు లాడ్జి నిర్వాహకుడికి చెల్లించిన రూ.6600 నగదు స్వాధీనం చేసుకున్నామని, వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్న లాడ్జి యజమాని సిరుపురం శ్రీనివాస్‌ను త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

సింగరేణికి బకాయిలు చెల్లించాలి

నస్పూర్: సింగరేణి సంస్థకు ప్రభుత్వం బొగ్గు, విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని సింగరేణి కోల్‌మైన్స్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్ కే 5 గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం ఏళ్ల తరబడి జాప్యం చేస్తుండడంతో సంస్థ ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందని పేర్కొన్నారు. అపరిష్కృత సమస్యల పరిష్కారానికి తమ సంఘం ద్వారా పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్అండ్‌పీసీ విభాగం టీబీజీకేఎస్ సహాయ కార్యదర్శి కొమ్ము బాపు బీఎంఎస్‌లో చేరగా ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, కేంద్ర కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు కట్కూరి సతీష్, బోయిన మల్లేశ్, మాదాసి రవీందర్, గూడ శ్రీకాంత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


కార్మికునికి కండువా వేస్తున్న సత్తయ్య

'జేఏసీపై ఆరోపణలను ఖండిస్తున్నాం'

మంచిర్యాలటౌన్: తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీపై పలువురు చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు జిల్లా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను మిగతా జేఏసీ భాగస్వామ్యం సంఘాలు, ఉపాధ్యాయ, నాలుగవ తరగతి, పెన్షనర్ల సంఘ నేతలను సంప్రదించిన తర్వాతనే ఒకరోజు మూల వేతనం ఇవ్వాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రెండు మూడు సంఘాలతో ఏర్పాటు చేసుకున్న జేఏసీలు ఉండడం సబబు కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, పీఆర్టీయూ(టిజి) జిల్లా అధ్యక్షుడు ధరణికోట వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవి, డీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేశ్, ఎం.జయకృష్ణ, ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చక్రపాణి, రాజవేణు, రాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గడియారం శ్రీహరి

ఎస్టీపీపీలో సీఐఎస్ఎఫ్ మాక్‌డ్రిల్

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్టీ ఏజెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహించారు. అడ్మిన్ భవన కార్యాలయంలో సీఐఎస్ఎఫ్ జవాన్స్, స్థానిక స్టేట్ పోలీస్, ఎస్టీపీపీ ఫైర్ సిబ్బంది, మెడికల్ స్టాఫ్ నేతృత్వంలో మాక్‌డ్రిల్ చేపట్టారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేశ్‌పర్మార్ మాట్లాడుతూ వార్షిక మల్టీ ఏజెన్సీ మాక్‌డ్రిల్ ప్రాముఖ్యతలను వివరించారు. ఏదైనా అనుకోని సంఘటన, టెర్రరిస్టులు, మావోయిస్టులు ప్లాంటులోకి చొరబడినప్పుడు ప్లాంటు, అధికారులు, ఉద్యోగులను ఎలా కాపాడుతారనే అంశాలను చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, జీఎం శ్రీనివాసులు, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎంలు ప్రసాద్, సుధాకర్, మదన్‌మోహన్, అధికారుల సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణ, ఎస్‌వోటు ఈడీ ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమాండెంట్ యోగేశ్ పర్మార్

కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం

చెన్నూర్: చెన్నూర్ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఇరువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పీఏ సమక్షంలో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఇరువురు నాయకుల తీరుపై కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెన్నూర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన వాటర్‌ట్యాంక్ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. చెన్నూర్‌కు చెందిన జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, భీమారం గ్రామానికి చెందిన చెకూర్తి సత్యనారాయణరెడ్డి మధ్య స్థానికతపై వాగ్వాదం ప్రారంభమైంది. ఒక పక్క కార్యక్రమం జరుగుతుండగా వీరు ఇరువురు గొడవ పడ్డారు. భీమారం గ్రామానికి చెందిన చేకూర్తి సత్యనారాయణరెడ్డిని చెన్నూర్‌లో జరిగే కార్యక్రమానికి ఎందుకు వచ్చావని మూల రాజిరెడ్డి బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. ఇది కాంగ్రెస్ సమావేశామని, అడిగేందుకు ఎవరంటూ ఎదురు దాడికి దిగారు. దీంతో గొడవ తీవ్రమైంది. ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది.

FORM-VII (see Rule 11(1))

Notice for appearance under section 13(1) of the Protection Of Women from Domestic Violence Act, 2005.

IN THE COURT OF THE HON'BLE JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT DHARMAPURI
D.V.C. 1 OF 2023

Between: Payela Mamatha and 2 others
Petitioner No. 1 to 3
And
Payela Srinivas and 7 others
Respondent No. 1 to 8

To,
1. Payela Srinivas S/o Chinna Rajaiah age 44 years occu: Business R/o Rayapatnam village of Dharmapuri Mandal of Jagtial dist now residing at H.No. 12-110/10-3, Rallapeta, Road No. 2, Manchirial dist. PIN 504 208
2. Payela Amruthamma W/o Chinna Rajaiah age 65 years Occu: Agriculture R/O Rayapatnam village of Dharmapuri Mandal of Jagtial dist now residing at H.No. 12-110/10-3, Rallapeta, Road No. 2, Manchirial dist. PIN 504 208
3. Payela Sunitha w/o Venugopal age 43 years Occu: Business R/o. Rayapatnam village of Dharmapuri Mandal of Jagtial dist Now residing at Sri Venkateswara Welding and Work Shop, Opp Sai Saketha Hospital, Beet Bazaar, Luxxettipet proper and mandal of Manchirial dist. Pin 504 215.
4. Kandrapu Mangamma W/o Laxman age 45 years Occu: Agriculture R/o. Rayapatnam village of Dharmapuri Mandal of Jagtial dist PIN 505 425.

Whereas the petitioner No. 1 to 3 has filed an application under section 12 of the Protection of Women from Domestic Violence Act, 2005.

You are hereby directed to appear before this court on the day of 25-09-2024 at 10-30 a.m. personally or through a duly authorized counsel of this court to show cause why the reliefs claimed by the Applicant against you should not be granted, failing which the court shall proceed ex parte against you

Given under my hand and the seal of the court, this the 23rd day of August 2024

// By order of the court//
Sd/- **DUMMENA SRINIVAS,**
Advocate Jagtial